ప్రజల కష్టాలు తీర్చేందుకే వైఎస్సార్ సీపీ ఆవిర్భావం

- భీమవరం ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్
- ఊరూరా ఘనంగా వైఎస్సార్ సీపీ ఆవిర్భావ వేడుకలు

సాక్షి, భీమవరం: ప్రజల కష్టాలు తీర్చేందుకే వైఎస్సార్‌సీపీ ఆవిర్భవించిందని ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ అన్నారు. వైఎస్సార్‌సీపీ 13వ ఆవిర్భావ వేడుకలు ఆదివారం తన క్యాంపు కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. పార్టీ జెండాను ఆవిష్కరించారు, అనంతరం భారీ కేకును కట్ చేసి పార్టీ శ్రేణులకు, ప్రజలకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజకీయాల్లో విశ్వసనీయతను, నమ్మకాన్ని పెంచింది మహానేత వైఎస్సార్ అయితే, నేడు ఆయన కుమారుడు, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తండ్రి బాటలోనే నడుస్తూ ప్రజల్లో రాజకీయాలపై విశ్వాసం పెంచేలా పనిచేస్తున్నారని అన్నారు. వైఎస్సార్ మరణానంతరం రాష్ట్రంలో వేలాదిమంది ఆయన మరణం తట్టుకోలేక చనిపోయిన నేపథ్యంలో వారి కుటుంబాలను పరామర్శించడానికి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఓదార్పు యాత్రను ప్రారంభించారని గుర్తు చేశారు. అయితే వైఎస్ జగన్ ప్రజల్లోకి వెళుతున్న నేపథ్యంలో ఆయనపై ప్రజలు చూపించిన అభిమానాన్ని ఆనాడు కాంగ్రెస్ పార్టీ తట్టుకోలేక ఏదో విధంగా ఓదార్పు యాత్రను నిలిపివేయాలని చూసిందని, కానీ వైఎస్ జగన్ మాత్రం ఆ కుటుంబాలను పరామర్శించి వారికి ధైర్యం చెప్పే క్రమంలో కాంగ్రెస్ పార్టీ అధిష్టానం ఆయనపై లేనిపోని కేసులను బనాయించి జైలుకు కూడా పంపిందన్నారు. అయినప్పటికీ కూడా ఆయన ప్రజల సమస్యలపై అనేక పోరాటాలు, ఆందోళనలు చేశారని తెలిపారు. 2019 ఎన్నికల్లో ఊహించని విధంగా 151 సీట్లను వైఎస్సార్ సీపీకి కట్టబెట్టారని పేర్కొన్నారు. ఎన్నికలలో ఇచ్చిన హామీలను ఇప్పటివరకు 99 శాతం హామీలను అమలు చేసిన ఘనత దేశంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌కు మాత్రమే దక్కిందని స్పష్టం చేశారు. ప్రతి కుటుంబం కూడా ఆర్థికంగా బలోపేతం కావాలనే లక్ష్యంతో నవరత్న పథకాలను అమలు చేస్తూ, మరోపక్క ఎన్నికలలో ఇవ్వని హామీలను కూడా అమలు చేస్తూ ప్రజల సంక్షేమానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి నిరంతరం కృషి చేస్తున్నారని అన్నారు. పార్టీ బలోపేతానికి పార్టీ శ్రేణులు చేస్తున్న కృషి ఎనలేనిదని, పార్టీ కోసం కష్టపడ్డ ప్రతి ఒక్కరికి తగిన గుర్తింపు కచ్చితంగా దక్కుతుందని, ఇందులో ఎటువంటి సందేహం లేదని ఆయన స్పష్టం చేశారు. భీమవరం నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో నడిపించడానికి శాయశక్తులా కృషి చేస్తున్నానన్నారు. రాష్ట్రంలోనే ఆదర్శ నియోజకవర్గంగా భీమవరం నియోజకవర్గాన్ని తీర్చిదిద్దుతాననడంలో ఎటువంటి సందేహం లేదన్నారు. పార్టీ శ్రేణులకు తాను ఎప్పుడూ కూడా పూర్తిగా అండగా ఉన్నానని, ఉంటానని అన్నారు. ముందుగా వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ కోటిపల్లి బాలదుర్గా నాగమల్లేశ్వరరావు (బాబు), ఎంపీపీ పేరిచర్ల విజయనర్సింహరాజు, జెడ్పీటీసీ సభ్యుడు కాండ్రేగుల నర్సింహరావు, ఏఎస్ రాజు, గూడూరి ఉమాబాల, చినమిల్లి వెంకట్రాయుడు, కామన నాగేశ్వరరావు, తోట భోగయ్య, నల్లం రాంబాబు, బలే ఏసుబాబు, పాలవెల్లి మంగ, వేండ్ర విజయదుర్గ, చిలకపాటి సునీత, కానుబోయిన వెంకటరమణ, గంటా సుందర్‌కుమార్, నాచు శ్రీవల్లి, మతల కాశీ, చెల్లబోయిన సూర్య ప్రకాష్, ఎం.గణేష్ పాల్గొన్నారు.


భీమవరంలో కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్


వీరవాసరంలో జెండాను ఆవిష్కరిస్తున్న పార్టీ నాయకులు


రాయకుదురులో వైఎస్సార్ విగ్రహం వద్ద నివాళులు అర్పిస్తున్న దృశ్యం

ఆత్మాభిమానానికి నిలువుటద్దం సీఎం జగన్

వీరవాసరం: వైఎస్సార్ సీపీ ఆవిర్భావ వేడుకలను ఆదివారం మండలంలో ఘనంగా నిర్వహించారు. వీరవాసరంలో నిర్వహించిన కార్యక్రమంలో పార్టీ మండల కన్వీనర్ గూడూరు ఓంకారం మాట్లాడుతూ ఆత్మాభిమానానికి నిలువుటద్దం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. బడుగు బలహీన వర్గాలకు నిత్యం ఆసరాగా ఉంటూ ప్రజల మనసుల్లో సుస్థిర స్థానం సంపాదించుకున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ఎప్పటికీ తిరుగు ఉండదన్నారు. తొలుత వీరవాసరం తూర్పు చెరువు సెంటర్లో పార్టీ జెండాను ఎగురవేశారు. రాయకుదురులో వైఎస్సార్ విగ్రహానికి పూలమాలవేసి ఘన నివాళి అర్పించారు. స్వీట్లు పంపిణీ చేశారు. ఆయా కార్యక్రమాల్లో నూకల కనకారావు, గొలగాని సత్యనారాయణ, గడ్డం భారతి, చికిలే మంగతాయారు, పి సత్యనారాయణ, నాగరాజు శ్రీనివాసరాజు, కడలి ధర్మారావు, గడ్డం భాస్కర్ రావు, వీరవల్లి కోటేశ్వరరావు, షేక్ సత్తార్ సాహెబ్ పాల్గొన్నారు.


భీమవరంలో పార్టీ జెండా ఎగరవేస్తున్న ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్

దేశంలోనే ఆదర్శవంత పాలన

భీమవరం అర్బన్: ప్రజా సంక్షేమం కోసం నిరంతరం పాటుపడిన మహానేత వైఎస్సార్ ఆదర్శప్రాయుడని, ఆయన బాటలోనే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్ర ప్రజలకు సుపరిపాలన అందిస్తూ దేశంలోనే ఆదర్శపాలన అందిస్తున్నారని ఏఎంసీ మాజీ చైర్మన్, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ తిరుమాని ఏడుకొండలు అన్నారు. కొత్తపూసలమర్రులో వైఎస్సార్ సీపీ ఆవిర్భావ దినోత్సవాన్ని ఆదివారం నిర్వహించారు. తొలుత వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించి పార్టీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సుపరిపాలన ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోవాలని తపనతో ఎవరెన్ని ఇబ్బందులకు గురిచేసినా ఎన్నో కష్టాలు పడి పార్టీని స్థాపించారని ఆనాటి పరిస్థితులను గుర్తుచేశారు. ప్రజా సంకల్పయాత్ర చేసి అన్ని వర్గాల వారి కష్టాలను తెలుసుకున్న వైఎస్ జగన్ నవరత్నాల పథకాలను రూపొందించి సమర్థవంతంగా అమలు చేస్తున్నారన్నారు. ప్రతి ఇంటిముంగిటకే సంక్షేమ ఫలాలు అందిస్తూ దేశంలో ఆదర్శ పాలన సాగిస్తున్నారన్నారు. నియోజకవర్గంలో ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ 100 పడకల ఆస్పత్రి, తాగునీటి సమస్యను తీర్చేందుకు ముందుచూపుతో 120 ఎకరాలు రక్షిత మంచినీటి చెరువులకు స్థల సేకరణ, పేదలకు 140 ఎకరాలకు పైగా స్థల సేకరణ చేసి ఎన్నో శాశ్వత అభివృద్ధి పనులు చేసి ప్రజల మన్ననలు పొందుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ జిల్లా కొండయ్య, ఎంపీటీసీ సభ్యులు తిరుమాని తులసీరావు, బర్రి నాగరాజు, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. దొంగపిండి గ్రామంలో వైస్ ఎంపీపీ తిరుమాని గంగా భవాని, నాయకులు తిరుమాని ధనంజయరాజు వైఎస్సార్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. రేవు రాంబాబు, రేవు పూర్ణ చంద్రరావు, రేవు శ్రీను, బస్వాని లక్ష్మీ నరసింహస్వామి పాల్గొన్నారు. గొల్లవానితిప్పలో నాయకులు గుద్దటి వెంకట రామారావు, సర్పంచ్ చిల్లే వెంకటేష్, ఉపసర్పంచ్ బుద్దాల రామకృష్ణ, గుద్దటి రవికుమార్, వెంపలో అల్లూరి కృష్ణంరాజు, శ్రీరామపురంలో కలిదిండి ఫణిరాజు, చినఅమిరంలో మాజీ సర్పంచ్ గొట్టుముక్కల సత్యనారాయణరాజు, కొమరాడలో సర్పంచ్ రామకృష్ణ స్వామి, తుందుర్రులో జెడ్పీటీసీ సభ్యులు కాండ్రేగుల నరసింహరావు, నాయకులు కోమటి రాంబాబు, మండల యువత అధ్యక్షులు నామన మహేష్, ఎల్‌వీఎన్‌పురంలో సర్పంచ్ కేతా నాగబాబు, బేతపూడిలో జిల్లా వ్యవసాయ సలహా మండలి డైరెక్టర్ కొట్టి కుటుంబరావు, నాయకులు కడియం వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు.


కొత్తపూసలమర్రులో వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేస్తున్న తిరుమాని ఏడుకొండలు

ప్రజల గుండెల్లో సీఎం వైఎస్ జగన్

- పీవీఎల్ నర్సింహరాజు, రామరాజు
- ఉండి నియోజకవర్గంలో ఉత్సాహంగా వైఎస్సార్ సీపీ ఆవిర్భావ వేడుకలు

కాళ్ల: తండ్రి ఆశయాలకు అనుగుణంగా ప్రజాసేవ చేస్తూ ప్రజల గుండెల్లో సీఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి సుస్థిర స్థానం సంపాదించుకున్నారని డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహరాజు అన్నారు. పెదఅమిరంలోని పార్టీ కార్యాలయంలో వైఎస్సార్ సీపీ ఆవిర్భావ దినోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. పార్టీ నాయకులు గోకరాజు రామరాజుతో కలిసి పార్టీ జెండాను ఆవిష్కరించారు. ముందుగా దివంగత నేత వైఎస్ రాజశేఖరరెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీని వ్యతిరేకించి తండ్రి ఆశయాలకు అనుగుణంగా పార్టీని ఏర్పాటు చేసి ఎన్ని ఒడిదుడుకులు వచ్చినా పార్టీని ముందుకు తీసుకు వెళుతున్నారన్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా రాష్ట్ర ప్రజలకు సంక్షేమ పథకాలు అందిస్తూ సీఎం వైఎస్ జగన్ సంక్షేమ సారథిగా అందరి మన్ననలు పొందుతున్నారని స్పష్టం చేశారు. తన పాదయాత్రలో ప్రజల కష్టాలు స్వయంగా చూసి ముఖ్యమంత్రి అయిన అనంతరం ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఒక్కరేనని అన్నారు. రాష్ట్రంలో అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు దేశంలో అందర్నీ ఆకర్షిస్తున్నాయని చెప్పారు. పన్నెండేళ్ల ప్రస్థానం ముగించుకుని పార్టీ 13వ వసంతంలోకి అడుగు పెడుతోందన్నారు. పార్టీ స్థాపించిన 12 ఏళ్లలో ఎన్నో సవాళ్లను అధిగమించి సంపూర్ణ ప్రజాబలంతో ప్రభుత్వం ఏర్పాటు చేశారని గుర్తు చేశారు. అధికారంలోకి వచ్చిన అనంతరం మేనిఫెస్టోలోని హామీలన్నీ అమలు చేస్తూ ప్రజారంజకంగా పరిపాలన సాగిస్తూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్ని వర్గాల మన్నన పొందుతున్నారని స్పష్టం చేశారు. పార్టీ కోసం అహర్నిశలు కష్టపడి పనిచేసిన ప్రతి కార్యకర్త నాయకులకు పార్టీ అండగా ఉంటుందన్నారు. నియోజకవర్గ మాజీ ఇన్‌చార్జి గోకరాజు రామరాజు మాట్లాడుతూ రాష్ట్ర ప్రజల అభ్యున్నతికి కృషి చేస్తున్న సీఎం వైఎస్ జగన్‌ను ప్రజలు మరువరున్నారు. 175కి 175 అసెంబ్లీ స్థానాలు గెలుపొందడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. కాళ్ల, ఉండి, ఆకివీడు జెడ్పీటీసీ సభ్యులు పచ్చిగోళ్ల సోమేశ్వరరావు, వేగేశ్న వెంకటరాజు, ఎంపీపీలు పెన్మత్స విశ్వనాథరాజు, భూపతిరాజు చంటిరాజు, ఇందుకూరి హరిబాబు కటారి జయలక్ష్మి, ఆకివీడు మున్సిపల్ చైర్‌పర్సన్ జామి హైమావతి, వివిధ కార్పొరేషన్ల రాష్ట్ర డైరెక్టర్లు జాగృతి విజయ్, గులిపల్లి అచ్చారావు, జిల్లా సర్పంచ్‌ల చాంబర్ అధ్యక్షుడు కొలుకులూరి ధర్మరాజు, మండల కన్వీనర్లు గణేష్ రాంబాబు, పెన్మత్స ఆంజనేయరాజు, గుండుగొలను ధనరాజు, సొసైటీల చైర్మన్లు పెన్మత్స ప్రసాదరాజు, వేగేశ్న జయ రామకృష్ణంరాజు, సుంకర భోగేశ్వరరావు, కేశిరెడ్డి మురళి, పేరిచర్ల సూర్యనారాయణరాజు, సంధ్యాల సీతారామయ్య, నియోజకవర్గంలోని ఆయా గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు, మున్సిపల్ కౌన్సిలర్లు పార్టీ నాయకులు కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

క్లుప్తంగా

స్త్రీలకు సత్కారం


స్త్రీలను సత్కరిస్తున్న దృశ్యం

సాక్షి, భీమవరం: ప్రపంచంలో మహిళల పాత్ర చాలా కీలకమైందని డాక్టర్ పట్టా దేవరాజ్ అన్నారు. ప్రపంచ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం బేతనీ లూథరన్ చర్చి వద్ద స్త్రీలను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కంప్యూటర్ యుగంలో పురుషులతో సమానంగా మహిళలు అన్నింటా ముందుంటున్నారన్నారు. తమ ప్రతిభతో ప్రతి రంగంలో సత్తాచాటుతున్నారని అన్నారు. పట్టా ఇందిరా, పి.అలీస్, ఎస్.నీలిమ, పి.సోని, బి.జ్ఞానకుమారి, ఎం.శ్యామలరాజు, పి.రవికుమారి, బి.రాజకుమారి, గంటా సుందర్‌కుమార్ పాల్గొన్నారు.

చర్చికి ర్యాలీగా తరలిన నాయకులు


గౌరీ పట్నం ర్యాలీగా వెళుతున్న పార్టీ నాయకులు, అభిమానులు

సాక్షి, భీమవరం: వైఎస్సార్ సీపీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఆదివారం నాయకులు, అభిమానులు భీమవరం పట్టణం నుంచి గౌరీపట్నం చర్చికు ర్యాలీగా వెళ్లి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికి, రాష్ట్ర ప్రజల సంక్షేమానికి, ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ కొరకు ప్రత్యేక ప్రార్థనలు చేశామన్నారు. భీమవరం నుంచి గౌరీపట్నం వెళ్లిన వారిలో గుంటి ప్రభు, పోతుల జశ్రీ, కొనాల బన్ను, కొనాల అనిల్, కొనాల రమేష్, ముప్పల రాజు, చిందడ ఇస్సాకు, మేటే సలేమే, దాగరపు చిన్న యేసయ్య, సొడదాసి యాకోబు, గొల్లమందుల ప్రేమ్, పోతుల హిట్లర్ తదితరులున్నారు.

కోనసీమ కవి సమ్మేళనంలో పంపనకు సత్కారం


పంపన సాయిబాబాను సత్కరిస్తున్న దృశ్యం

వీరవాసరం: అమలాపురంలో జరిగిన ఉగాది కవి సమ్మేళనంలో వీరవాసరం జెడ్పీ హైస్కూల్ తెలుగు ఉపాధ్యాయుడు పంపన సాయిబాబు రాసిన ఉగాది కవిత పలువురిని ఆకట్టుకుంది. వివరాలను సాయిబాబు ఆదివారం స్థానిక విలేకరులకు వెల్లడించారు. రాష్ట్ర సాహిత్య అకాడమీ సహకారంతో శ్రీశ్రీ కళావేదిక, కోనసీమ రచయితల సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన శోభాకృత నామ సంవత్సర జాతీయ శతాధిక ఉగాది కవి సమ్మేళనంలో సాయిబాబు ఉగాది శోభాకృత్ నామ సంవత్సరంపై కవితాగానం చేసి అందరి మన్నలను పొందారు. ఈ సందర్భంగా పంపన సాయిబాబును, సాహిత్య అకాడమీ చైర్‌పర్సన్ పిల్లంగోళ్ళ శ్రీలక్ష్మి, శ్రీశ్రీ కళావేదిక, కోనసీమ రచయితల సంఘం ఆధ్వర్యంలో ఆయనను ఘనంగా సత్కరించారు.

వైస్ చైర్మన్ పుప్పాలకు పీవీఎల్ పరామర్శ


సుబ్బమ్మ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పిస్తున్న డీసీసీబీ చైర్మన్ పీవీఎల్

ఆకివీడు: స్థానిక నగర పంచాయతీ వైస్ చైర్మన్ పుప్పాల పండు నాయనమ్మ సుబ్బమ్మ మృతి పట్ల డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహరాజు ఆదివారం సంతాపం వ్యక్తం చేశారు. ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యుల్ని పీవీఎల్ పరామర్శించారు. కార్యక్రమంలో సొసైటీ త్రిసభ్య కమిటీ చైర్మన్ కేశిరెడ్డి మురళీ, చుండూరి వెంకట్రావు, వానపల్లి బాబూరావు, మోటుపల్లి గంగాధరరావు, మోరా జ్యోతి, గుండా సుందరరామనాయుడు, జీ.ధనరాజు, శిరపు శ్రీనివాస్, కట్రెడ్డి మోహన్, కత్తుల శ్రీను, నందమూరి సత్యవతి, తిప్పా దుర్గాభవాని పాల్గొన్నారు.

నేటి నుంచి హోమాలు

భీమవరం (ప్రకాశంచౌక్): పట్టణంలోని హౌసింగ్‌బోర్డు కాలనీలోని శ్రీపద్మావతి సమేత వెంకటేశ్వరస్వామి మందిరం నిర్మించి 12 ఏళ్లు అయిన సందర్భంగా సోమవారం నుంచి అద్భుత శాంతి అష్టబంధన మహా సంప్రోక్షణ కుంభాభిషేక మహోత్సవాలు ఘనంగా జరగనున్నాయి. ఈనెల 18వ తేదీ వరకు కుంభాభిషేక మహోత్సవాలు జరుగుతాయని ఆలయ కమిటీ అధ్యక్షుడు కంతేటి వెంకట్రాజు తెలిపారు. ఇప్పటికే యాగశాలను నిర్మించారు. ఆలయ ప్రధాన అర్చకులు శ్రీనివాసాచార్యులు మాట్లాడుతూ లోకశాంతికోసం ఈ యాగం చేస్తున్నట్లు తెలిపారు. ఆలయ కమిటీ సభ్యులు జానపాటి మధు, తాడికొండ కోటేశ్వరరావు, చెరుకువాడ రంగసాయి, రాంప్రసాద్, కడలి వెంకటేశ్వరరావు, సూర్యనారాయణరాజు, భక్తులు పాల్గొన్నారు.

దళితవాడల అభివృద్ధికి కృషి చేయాలి

ఉండి: గ్రామాల్లో దళిత వాడల అభివృద్ధిపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని మాలమహానాడు జాతీయ అధ్యక్షుడు నన్నేటి పుష్పరాజ్ అన్నారు. ఆదివారం చెరుకువాడ పెదపేటలో నిర్వహించిన నూతన కమిటీని నియమించారు. మండల యూత్ అధ్యక్షుడిగా ఏలూరి విజయబాబు, గ్రామాధ్యక్షుడిగా కొత్తపల్లి కృపారావు, ఉపాధ్యక్షుడిగా కంకిపాటి విజయ్, ప్రధాన కార్యదర్శి కొత్రపాటి మధు, సహాయ కార్యదర్శి చిగురుపాటి కరుణాకర్, కార్యదర్శులు కుచ్చునపల్లి జీవన్‌బాబు, కొత్తపల్లి ప్రేమ్, పాకలపాటి రమేష్, గునుపూడి బుజ్జిబాబులకు నియామకపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా పుష్పరాజ్ మాట్లాడుతూ దళితవాడల అభివృద్ధికి ఎస్సీ సబ్‌ప్లాన్ నిధులను ఖర్చు చేసి వారి పురోభివృద్ధికి తోడ్పడాలన్నారు. మాలమహానాడు ఉభయగోదావరి జిల్లాల అధ్యక్షుడు నేతల సువర్ణరాజు, నాయకులు పిట్టా వినోద్‌కుమార్, తొర్లపాటి భాగ్యరాజు, ఆలమూరి రాజశేఖర్, యరగపాటి నవోమబిరాజు పాల్గొన్నారు.


నియామక పత్రాలు అందించిన పుష్పరాజ్

హృద్రోగ వైద్య సేవలు అభినందనీయం

భీమవరం(ప్రకాశంచౌక్): ఉచిత హృద్రోగ వైద్య శిబిరం నిర్వహించడం అభినందనీయమని మున్సిపల్ కమిషనర్ శివరామకృష్ణ అన్నారు. ఆదివారం మెంటేవారి తోటలోని అల్లూరి సీతారామరాజు భగత్‌సింగ్ వైద్య సహాయ కేంద్రం (సుందరయ్య భవనం)లో హైదరాబాద్‌కు చెందిన శ్రీలక్ష్మి గాయత్రి హాస్పిటల్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన గుండె వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ యాంత్రిక జీవనంలో నిత్యం ఒత్తిడిగురవుతున్న నేపథ్యంలో వంశపారంపర్య పర్యంగాను జీవన విధానంలోనూ ఎందరో గుండె సమస్యలు ఎదుర్కొంటున్నారని అటువంటి వారికి పేదలకు ఉచిత గుండె వైద్య శిబిరం నిర్వహించడం అభినందనీయమన్నారు. వసుధ ఫౌండేషన్ కన్వీనర్ ఇందుకూరి ప్రసాదరాజు, సీనియర్ కార్డియాలజిస్ట్ డాక్టర్ జి.సుధీర్, కార్డియాలజిస్ట్ డాక్టర్ కవిత వైద్య పరీక్షలు చేశారు. వసుధ ఫౌండేషన్ కార్యదర్శి మంతెన కృష్ణంరాజు, కో-ఆర్డినేటర్ ఎంవీ రామరాజు, ఎస్ఎల్‌జీ ప్రతినిధి వై.రణదివె, విజ్ఞాన కేంద్రం కన్వీనర్ వి.రాధాకృష్ణ పాల్గొన్నారు.

ఘనంగా సూర్యహోమం

పాలకొల్లు సెంట్రల్: ప్రజలు ఆయురారోగ్యాలతో ఉండాలనే సంకల్పంతో పట్టణంలో సరస్వతి శిశుమందిర్‌లో నిర్వహిస్తున్న సూర్యహోమం ఆదివారం 146వ వారానికి చేరుకుంది. కోడిగట్టు సరస్వతి శిశుమందిర్‌లో ఈ ఆదివారం పురోహితులు రవీంద్ర బ్రహ్మత్వంలో సూర్యహోమం నిర్వహించారు. ప్రతి ఆదివారం నిర్వహించే ఈ సూర్యహోమంలో పాల్గొనే భక్తులు కోడిగట్టు సరస్వతి శిశు మందిర్ వద్ద తమ పేర్లను నమోదు చేయించుకోవాలని నిర్వాహకులు కేవీఎల్ నరసింహరావు కోరారు.

● రుద్రభూమే క్రీడాస్థలి


స్థానిక ధర్మాపుర అగ్రహారంలోని శ్మశానవాటికలో వాలీబాల్ ఆడుతున్న యువకులు

ఆట స్థలం దొరకకపోయినా సరిపడే జాగా ఉంటే చాలు యువకులు ఆటలాడేస్తున్నారు. ఇటీవల యువత క్రీడలపై ఆసక్తి చూపుతూ గ్రామాల్లో స్థానికంగా నిర్వహించే క్రికెట్, వాలీబాల్, కబడ్డీ పోటీల్లో ఉత్సాహంగా పాల్గొంటున్నారు. ఆటకు అనువుగా ఉండే స్థలాలే కాకుండా, ఖాళీగా ఉన్న చేపల చెరువులు తదితర ప్రాంతాల్లో కోర్టులు నిర్మించుకుంటూ సాధన చేస్తున్నారు. స్థానిక ధర్మాపుర అగ్రహారంలోని యువకులు ఇలా శ్మశాన వాటికలో ఖాళీ స్థలంలో వాలీబాల్ ఆడుతూ ఇలా కనిపించారు. - ఆకివీడు

దాడిపై కేసు నమోదు

భీమవరం అర్బన్: అన్యాయంగా కొట్టి గాయపరిచాడని వ్యక్తి ఫిర్యాదు మేరకు ఆదివారం పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాలిలా ఉన్నాయి. నరసింహపురంలోని రాజుల కాలనీలో పాక జాన్ నివాసముంటున్నాడు. సాయంకాలం ఇంటి సామగ్రి తీసుకువెళ్లడానికి ఇంట్లోకి వెళుతుండగా పొరుగున ఉన్న బొక్కా కృష్ణ దుర్భాషలాడుతూ అన్యాయంగా కొట్టి గాయపరిచాడు. ఈ మేరకు బాధితుడు పాక జాన్ ఫిర్యాదు మేరకు రూరల్ ఎస్సై మోహన్‌రావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బాకీ తీర్చాలని అడిగితే..

భీమవరం అర్బన్: పాత గొడవలను పురస్కరించుకుని ఆదివారం ఇద్దరి మధ్య గొడవ జరిగి ఘర్షణకు దారి తీయడంతో పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాలిలా ఉన్నాయి. దెయ్యాలతిప్ప గ్రామానికి చెందిన రామాని రమేష్‌కు అదే గ్రామానికి చెందిన తిలకలపూడి శ్రీనివాస్ నగదు బాకీ పడ్డాడు. వీరిద్దరికి గతంలో పాత గొడవలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో రామాని రమేష్ డబ్బులు ఇవ్వాలని తిలకలపూడి శ్రీనివాస్‌ను అడగ్గా దుర్భాషలాడి తనను, తన భార్యను చంపేస్తానని బెదిరిస్తున్నాడని రామాని రమేష్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు హెడ్ కానిస్టేబుల్ మహేశ్వరరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

జూదరుల అరెస్ట్

పాలకోడేరు: పాలకోడేరులో పేకాడుతున్న ముగ్గురు జూదరులను అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి రూ.1,100 నగదు స్వాధీనం చేసుకున్నామని ఎస్సై నాళం శ్రీనివాసరావు తెలిపారు. కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపరుస్తామన్నారు.

ఎంప్లాయిస్ క్రికెట్ విజేత 'సూపర్ సర్వేయర్స్'


విన్నర్స్ ట్రోఫీతో సూపర్ సర్వేయర్స్ టీం సభ్యులు

కాళ్ల: క్రీడా పోటీలు నిర్వహించటం అభినందనీయమని పలువురు సచివాలయ ఉద్యోగులు అన్నారు. కోపల్లె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో రెండు రోజులుగా మండలంలోని సచివాలయం సిబ్బందితో నిర్వహించిన ఎంప్లాయిస్ క్రికెట్ ప్రీమియర్ లీగ్ ఆదివారంతో ముగిసింది. ఈ టోర్నమెంట్లో సర్వేయర్స్, డిజిటల్ అసిస్టెంట్స్, పంచాయతీ సెక్రెటరీ, ఇంజనీరింగ్ అసిస్టెంట్స్, వెల్ఫేర్ అసిస్టెంట్స్, ఆర్బీకే సిబ్బంది కలిసి నాలుగు టీములుగా పాల్గొన్నారు. ఆదివారం నిర్వహించిన ఫైనల్ మ్యాచ్లో సూపర్ సర్వేయర్స్ జట్టు వెల్ఫేర్ అండ్ ఆర్బీకే జట్టుపై విజయం సాధించింది. వీరికి కాళ్లకూరు, దొడ్డనపూడి కంప్యూటర్ ఆపరేటర్ ఆరేటి రమేష్ నాయుడు తన తల్లి నాగమణి జ్ఞాపకార్థం బహుమతులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ స్నేహపూరిత వాతావరణంలో జరిగిన ఈ మ్యాచ్‌లో నిత్యం బిజీగా ఉండే సచివాలయ సిబ్బంది మధ్య స్నేహ భావం ఏర్పరచాలనే ఆలోచనతో గత మూడు ఏళ్లుగా ఈ టోర్నమెంటును నిర్వహిస్తున్నామన్నారు. టోర్నమెంట్ విజయవంతానికి కృషి చేసిన ఆర్గనైజర్లు శ్రీనివాస్ నాగబాబు, వాసు, సత్యనారాయణ లకు సచివాలయ ఉద్యోగులు కృతజ్ఞతలు తెలిపారు.

మావుళ్లమ్మకు బంగారం సమర్పణ

భీమవరం(ప్రకాశంచౌక్): పట్టణ ఇలవేల్పు శ్రీమావుళ్లమ్మవారికి హైదరాబాద్‌కు చెందిన మానేపల్లి బాలశ్రీనివాస్ 10 గ్రాముల బంగారాన్ని సమర్పించారు. వీరికి ధర్మకర్త రామాయణం సత్యనారాయణ రసీదును అందచేశారు. ఆలయ ప్రధానార్చకులు మద్దిరాల మల్లికార్జునశర్మ అమ్మవారి ప్రసాదం అందజేశారు.

పోలింగ్‌కు సహకరించండి

సాక్షి, భీమవరం: పట్టణంలో ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో పోలింగ్ స్టేషన్ పరిసర ప్రాంతాలైన తాలూకాఫీస్ రోడ్డు, అర్బన్ బ్యాంక్ రోడ్డులోని షాపులను సాయంత్రం 5 గంటల వరకు మూసివేయాలని ఆర్డీఓ దాసి రాజు చాంబర్స్ ప్రతినిధులకు ఆదివారం సూచించారు. వ్యాపారస్తులు షాపులు మూసివేసి ఎన్నికలు ప్రశాంతంగా జరిగేందుకు సహకరించాలని కోరారు.

ఆటో బోల్తా.. ఇద్దరికి గాయాలు

కాళ్ల: ఆటో బోల్తా పడి ఇద్దరికి గాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం కోమటిగుంట గ్రామానికి చెందిన నలుగురు ఆటోలో భీమవరం బయలుదేరారు. పెదఅమిరం వద్దకు వచ్చేసరికి ఆటో అదుపుతప్పి బోల్తా కొట్టింది. ఈ ఘటనలో ఆటోలో ప్రయాణిస్తున్నవారిలో ఇద్దరికి గాయాలు అవటంతో స్థానికులు భీమవరం ఆస్పత్రికి తరలించారు. ఆసుపత్రి నుంచి వచ్చిన సమాచారం మేరకు కాళ్ల ఎస్సై ఏజీఎస్ మూర్తి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రాములోరు గుడికి ఉత్సవ విగ్రహాల అందజేత

ఆకివీడు: మండలంలోని అయిభీమవరం గ్రామంలోని పురాతన దేవాలయం కోదండ రామాలయానికి టీటీడీ మాజీ చైర్మన్ కనుమూరి బాపిరాజు ఉత్సవ విగ్రహాల్ని అందజేశారు. శ్రీరామనవమి సందర్భంగా స్వామి వారి కల్యాణోత్సవం, ఉత్సవాలు నిర్వహించేందుకు ఆలయంలో ఉత్సవ విగ్రహాల ఆవశ్యకతను గుర్తించి వీటిని అందజేయడంపై పలువురు అభినందించారు.


ఉత్సవ విగ్రహాలను అందజేస్తున్న కనుమూరి బాపిరాజు దంపతులు